

13న చంద్రయాన్-3 ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ నెల 13వ తేదీన చంద్రయాన్-3 ప్రయోగించేందుక సర్వం సిద్ధం చేస్తోంది. - 8లో



సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ

పోలీసులు సమన్వయంతో సమష్టిగా కృషి చేస్తే నేరాల నియంత్రణ సాధ్యమని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	26
చిత్తూరు	32	25
తిరుమల	28	22
గూడూరు	34	28
నగరి	33	26

న్యూస్‌రీల్

పీఎంపీఎం పోర్టల్ అంశాలపై సమీక్ష

తిరుపతి అర్బన్: ప్రధాన మంత్రి ప్రాజెక్ట్ మానిటరింగ్ (పీఎంపీఎం) పోర్టల్‌లో సూచించిన ప్రాధాన్యత అంశాలపై దృష్టి పెట్టాలని ఆర్అండ్‌బీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. ఆయన బుధవారం కేంద్ర కేబినెట్ సెక్రటరీతో కలిసి అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి, రైల్వేలకు భూసేకరణ, అటవీ అనుమతులు, ఏపీఐఐసీ భూముల వివరాలు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణాలు, జాతీయ రహదారుల తదితర అంశాలపై పురోగతి చూపాలని సూచించారు. సమావేశంలో ల్యాండ్ అక్విజేషన్ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో విదేశీ భక్తులు



పూజలు చేసుకుంటున్న జర్మనీ దేశస్థులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం జర్మనీ దేశస్థులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. విదేశీయులు మొదట మహన్యాస పూర్వక రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను సేవించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ, పీజీ తదితర సర్టిఫికెట్లు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు డిగ్రీ, పీజీ తదితర సర్టిఫికెట్లను సులువుగా పొందడానికి కొత్తగా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను బుధవారం రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, పరీక్షల డీన్ ప్రొఫెసర్ కిశోర్, నియంత్రణాధికారి దామ్లా నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్వీయూ పరీక్షల విభాగంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తొలి విడతగా దూరప్రాంత విద్యార్థులు వర్సిటీకి రాకుండానే వారి స్వస్థలం నుంచే ×ఎస్వీయూఈఎక్సెఎంఎస్.ఈడీయు.ఇన్× వెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా ఫీజు చెల్లించి ఆ రసీదుతో పాటు ఇతర వివరాలు నింపిన అప్లికేషన్ వర్సిటీకి చేర్చాలని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ, దూరప్రాంత విద్యార్థులకు ఇదొక మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి నగేష్, మీడియా కో-ఆర్డినేటర్ డాక్టర్ పీసీ.వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

15నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో ఈనెల 15నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షల షెడ్యూల్‌ను సంబంధిత కళాశాలలకు పంపించినట్లు తెలిపారు. ఈ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు, టైం టేబుల్‌తో పాటు ఆయా కళాశాలలకు పంపించినట్లు తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలల్లో నిర్వహించే వివిధ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీ-మ్యూజిక్, బీ-డ్యాన్స్, ఒకేషనల్‌కు సంబంధించిన పరీక్ష తేదీలను కళాశాల నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. విద్యార్థులకు హాల్ టికెట్లను సకాలంలో అందించి పరీక్షల తేదీలను గుర్తుచేయాలని కోరారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పరీక్ష పరిశీలకులను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

■ చిత్తూరు నగరానికి చెందిన ఓ యువతి (17) కుటుంబం బెంగళూరులో నివాసముంటోంది. ఇంటర్‌తో చదువుకు స్వస్తి చెప్పిన ఆ యువతి ఓ ప్రైవేటు కంపెనీలో పనికి చేరింది. అక్కడ పరిచయమైన 20 ఏళ్ల కుర్రాడితో ప్రేమలో పడింది. పెళ్లి కాలేదు కానీ..గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు గుట్టుచప్పుడు కాకుండా చిత్తూరుకు తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవం చేయించారు. పుట్టిన శిశువు (ఆడబిడ్డ)ను బంగారుపాళ్యంలోని పిల్లలు లేని దంపతులకు అప్పగించేశారు.

■ పలమనేరు చెందిన 18 ఏళ్ల గర్భిణికి 7వ నెలలోనే పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబీకులు ఆమెను హైరిస్క్ కేసుగా గుర్తించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. చివరకు శిశువు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ వారం రోజులపాటు చికిత్స చేసినా బిడ్డ మృతి చెందింది.

ఇవి మచ్చుకు రెండే.. ఇలాంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా జరుగుతున్నాయి. తెలిసీ తెలియని వయసు. ప్రేమకు ఆకర్షణకు వ్యత్యాసం తెలుసుకోలేని లేత మనసు. పాశ్చాత్య పోకడలపై పెరుగుతున్న మోజు. సినిమాలు.. సెల్‌ఫోన్లు కొందరు టీనేజర్లపై తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయి. చిరుప్రాయంలోనే గర్భం దాల్చే పరిస్థితిని తీసుకువస్తున్నాయి. క్షణికావేశంలో చేసే చిన్నపాటి తప్పులే వారి జీవితాలను చిదిమేస్తున్నాయి. చివరకు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అబార్షన్ చేయించుకునే దుస్థితిని కల్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్నిచోట్ల తల్లిదండ్రులు తమ తొందరపాటు కారణంగా బాలికల బతుకులను చీకటిలోకి నెట్టేస్తున్నారు. బంధుత్వం కోసమో.. ఆస్తులు అంతస్తుల కోసమో.. బాధ్యత తీర్చేసుకోవాలనే తాపత్రయంతోనే ఆడపిల్లలను బాల్యవివాహాలకు బలి చేసేస్తున్నారు. సంసార సాగరంలోకి బలవంతంగా నెట్టేసి చిట్టితల్లుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



- టీనేజ్‌లోనే అమ్మలవుతున్న అమ్మాయిలు
- 18 ఏళ్లు నిండకనే ప్రసవాలు
- పెరుగుతున్న అక్రమ అబార్షన్లు
- చిన్న వయసులో ప్రెగ్నెన్సీతో అనర్థాలంటున్న వైద్యులు
- నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

చిట్టి 'తల్లులు'!

సాక్షి, తిరుపతి డెస్క్ : ముక్కుపచ్చలారని బాలికలు తల్లులవుతున్నారు. 18 ఏళ్లు నిండకనే గర్భవతులవుతున్నారు. వయసు తీసుకువచ్చిన ఆకర్షణలతోపాటు బాల్య వివాహాలు సైతం చిన్నారులు తల్లులుగా మారుతున్నారు. ఏటా ఇలాంటి కేసులు పదుల సంఖ్యలో పెరుగుతున్నాయి. మాతా శిశు మరణాలకు దారితీస్తున్నాయి. మైనర్ బాలికల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఇదే సమయంలో పలు చోట్ల టీనేజర్లకు గుట్టుగా అబార్షన్లు జరుగుతున్నాయి. అయితే ఇలాంటివి పలు అనర్థాలకు దారితీస్తాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమంగా అబార్షన్లు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతి నెలా 300లకు పైగానే..!

ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రతినెలా దాదాపు 5 వేలకు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. అయితే వీటిలో 18 ఏళ్లు నిండని వారు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నట్లు వైద్యశాఖ అధికారులు గుర్తించారు. అధికారికంగా ప్రతినెలా 300లకు పైగా టీనేజీ అమ్మాయిలకు ప్రసవాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటళ్లలోనే 150 నుంచి 200 వరకు టీనేజర్లకు ప్రసవాలు చేస్తున్నట్లు అంచనా వేశారు. ఇలా చిన్నవయసులోనే గర్భం దాలిస్తే మాతాశిశుమరణాలు సంభవించే ప్రమాదముందని వైద్యులు వెల్లడిస్తున్నారు. అబార్షన్లు చేయించుకున్నా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. వీటి దుష్ప్రభావాలను జీవితాంతం ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.



టీనేజర్ల ప్రసవాలపై మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి (ఫైల్)

ప్రైవేట్ దందా

టీనేజ్‌లో గర్భం దాల్చిన బాలికలకు గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వారు అబార్షన్ చేస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా గర్భాలను విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇందుకోసం కొందరు ప్రత్యేకంగా భవనాలను అద్దెకు తీసుకుని దందా సాగిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

చిత్తూరు జిల్లాలో టీనేజర్ల ప్రసవాల వివరాలు

జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
103	146	43	108	106	124

తిరుపతి జిల్లాలో టీనేజర్ల ప్రసవాల వివరాలు

జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
89	74	64	85	95	83

ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు

టీచింగ్ హాస్పిటళ్లు	జిల్లా ఆస్పత్రి	ఏరియా వైద్యశాలలు	సీహెచ్‌సీలు	పీహెచ్‌సీలు	ప్రైవేట్ ఆస్పత్రులు
2	1	7	15	108	సుమారు 3వేలు

టీనేజీలో ప్రసవం.. నష్టాలు

- తీవ్రస్థాయిలో రక్తపోటు
- పెల్విక్ ఎముకలు దృఢంగా లేకపోవడం వల్ల సాధారణ కాన్పుకి ఇబ్బందులు ఏర్పడే అవకాశం
- నెలలు నిండక ముందే బిడ్డ పుట్టడం
- కడుపులోనే శిశువు మరణించడం
- తక్కువ బరువుతో జన్మించడం
- శిశువుకు శ్వాస సంబంధింత సమస్యలు రావడం
- బిడ్డ ఎదుగుదలలో లోపాలు
- తల్లి పోషకాల లోపంతో బిడ్డలో మానసిక, శారీరక సమస్యలు
- కాన్పు సమయంలో తల్లి మృతి చెందే అవకాశం

బాల్యవివాహాల నివారణకు కృషి



బాల్యవివాహాలను అరికట్టేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నాం. ఎక్కడైనా బాలికలకు పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే అక్కడ వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత 6 నెలల్లో 107 బాల్యవివాహాలను అడ్డుకున్నాం. మైనర్లకు ఎక్కడైనా వివాహం జరిపిస్తుంటే సమీపంలోని అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీసు, సీడీపీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఐసీపీఎస్, ఐసీడీఎస్ సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబరు 1098, 100కు సమాచారం అందించాలి.

– శ్యాంసుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

శ్రేయస్కరం కాదు



15 నుంచి 19 ఏళ్లలోపు అమ్మాయిలకు ప్రసవాలు శ్రేయస్కరం కాదు. ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు వస్తాయి. ముఖ్యంగా శారీరక, మానసికంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మాతా శిశు మరణాలకు కూడా దారితీసే ప్రమాదముంది. ఇక పెళ్లి కాకుండా అబార్షన్లకు వస్తున్నారు. బయట తెలియక ఎన్నో జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన తీసుకోరావాలి.

– ఉషశ్రీ, గైనకాలాజిస్ట్, జిల్లా ఆస్పత్రి, చిత్తూరు

ఇది చట్ట విరుద్ధం



ప్రస్తుతం సమాజంలో ఆధునిక పోకడల కారణంగా పలువురు పిల్లలు దారితప్పుతున్నారు. ప్రేమలో పడి 18 ఏళ్లలోపే పెళ్లికి సిద్ధపడుతున్నారు. కొందరు పెద్దల సమక్షంలోనే పెళ్లి చేసుకుంటున్నారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధం. వీటిని ప్రోత్సహిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పరిస్థితులను వివరిస్తున్నాం.

– వెంకట సుబ్బమ్మ, బీఎన్‌పేట ఎస్‌ఐ, చిత్తూరు

అక్రమ అబార్షన్ల కట్టడి



అక్రమ అబార్షన్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. కొందరు ఆర్ఎంపీలు, బయట వ్యక్తులతో అబార్షన్లు చేయించుకుంటున్నారు. ఇలాంటి వాటి వల్ల గర్భసంచిలో సమస్యలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరమైనా అబార్షన్లు చేయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇలాంటివి ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే మాకు ఫిర్యాదు చేయవచ్చు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రవిరాజు, పీసీపీఎన్‌డీటీ, చిత్తూరు

తిరుమలలో పకడ్బందీ భద్రత

తిరుమల : ఆధునిక టెక్నాలజీని వినియోగించి తిరుమలలో పకడ్బందీ భద్రత కల్పించినట్లు ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్‌బాబు తెలిపారు. బుధవారం పీఏసీ-4లోని సమావేశ మందిరంలో తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్యతో కలిసి ఆక్టోపస్, పోలీస్, ఫైర్, రెవెన్యూ, వైద్య, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తరచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా భద్రత లోపాలను అధిగమించవచ్చన్నారు. సంఘ విద్రోహులు దాడి చేసినప్పుడు ఎలా తిప్పికొట్టి భక్తులకు రక్షణ కల్పించాలన్నదే మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఆక్టోపస్ డీఎస్పీ నరసింహారావు సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొనేటప్పుడు ఎవరు ఎలా పనిచేయాలనే విషయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం రాత్రి 8 నుంచి11 గంటల వరకు తిరుమలలోని పద్మావతి విశ్రాంతి గృహం వద్ద ఆక్టోపస్ దళం, నిఘా, భద్రత విభాగం, పోలీసు, సంబంధిత శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమల డీఎస్పీ భాస్కర్ రెడ్డి, టీటీడీ వీజీఓ గిరిధర్, ఫైర్ ఆఫీసర్ సుబ్రమణ్యం రెడ్డి, ఏవీఎస్‌ఓలు సతీష్, గిరిధర్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

వాకాడు : పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని జమీన్‌కొత్తపాళెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు 22 పథకాల ద్వారా రూ.2.40లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేశారని వెల్లడించారు. 2014లో ప్రజలను మోసం చేసి గెలుపొందిన చంద్రబాబును రాజకీయాలను నుంచి శాశ్వతంగా తరమికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరితో పొత్తు పెట్టుకోకుండా.. దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. జగనన్న మాదిరిగా సొంతంగా పార్టీ పెట్టుకుని పోటీ చేస్తేనే ప్రజల్లోకి వెళ్లే అర్హత చంద్రబాబుకు వస్తుందని స్పష్టం చేశారు. సుపరిపాలన అందిస్తూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, వెంకటరమణయ్య, కిరణ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పరిహారం.. విష ప్రచారం!

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోంది. ఇందుకోసం పకడ్బందీగా కార్యాచరణ అమలు చేస్తోంది. అర్హులందరికీ బీమా సొమ్ము చెల్లించేందుకు సన్నద్ధమవుతోంది. ఇది చూసి ఓర్వలేని పచ్చమీడియా తప్పుడు రాతలతో ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తోంది. లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో సిద్ధం కాకుండానే సక్రమంగా పరిహారం పంపిణీ చేయడంలేదంటూ అసత్య కథనాలతో విషం చిమ్ముతోంది.



- శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన ఈ రైతు పేరు బి.అమరనాథ్‌రెడ్డి. గత ఏడాది 8.98 ఎకరాల్లో పంట సాగు చేశాడు. వైపరీత్యాల కారణంగా 33 శాతం కంటే ఎక్కువ మోతాదులో పంట నష్టం వాటిల్లింది. దీంతో ఈయనకు పరిహారం కింద రూ. 24 వేలను ప్రభుత్వం అందించనుంది. సకాలంలో నష్టం అంచనా వేసి బీమా సొమ్ము చెల్లిస్తుండడంపై రైతు హర్షం వ్యక్తం చేస్తున్నాడు.



- కేవీబీ పురానికి చెందిన ఈ రైతు పేరు కె.ఏలుమలై. గత ఏడాది 2.36 ఎకరాల్లో వేరుశనగ సాగు చేయగా పంట దెబ్బతింది. దీంతో ప్రభుత్వం రూ.6 వేల పరిహారం చెల్లించనుంది. రైతులకు అండగా నిలుస్తూ ఉచితంగానే బీమా సౌకర్యాన్ని కల్పించి, పరిహారం కూడా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సదరు రైతు ఆనందంగా చెబుతున్నాడు.

- నష్టపోయిన పంటలకు బీమా
- 8న లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సన్నాహాలు
- మొత్తం 51,491 మంది రైతులకు రూ.10.64 కోట్లు
- ఆర్‌బీకేలో జాబితాల ప్రదర్శన
- మార్పులు, చేర్పులు పూర్తికాకనే పచ్చమీడియా తప్పుడు

చిత్తూరు అగ్రికల్చర్ : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, ఈదురుగాలులకు పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని రైతు దినోత్సవం నాడు లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయనుంది. ఈ మేరకు లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే ప్రచురించారు. దీనిపై ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. అయితే ఎల్లో మీడియా మాత్రం లబ్ధిదారులకు సక్రమంగా పరిహారం చెల్లించలేదని, కొంత మందికి చాల తక్కువ సొమ్మును బీమా కింద అందించారని అసత్య కథనాలతో తప్పుడు ప్రచారానికి ప్రయత్నిస్తోంది.


పంట నష్టం గుర్తింపు ఇలా...

వాతావరణ పరిస్థితుల కారణంగా నష్టపోయిన పంటలకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. సాగు చేస్తున్న ప్రతి పంటను ముందస్తుగానే ఈ-క్రాప్ నమోదు చేస్తోంది. పంట నష్టం వాటిల్లినప్పుడు ఆయా గ్రామాల రైతు భరోసా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. నష్టాన్ని నమోదు చేస్తారు. అందులో నిబంధనల మేరకు 33 శాతానికి మించి దెబ్బతిన్న పంటలను మాత్రమే బీమా పరిధిలోకి తీసుకుంటారు. ఈ విధంగా సేకరించిన జాబితాలను ముందస్తుగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. అందులో నష్టపోయిన పంట నమోదు కాకపోయినా, అనర్హులు ఉన్నా ఆర్‌బీకే సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వెంటనే మార్పులు, చేర్పులు చేస్తారు. ఈ విధంగా సిద్ధం చేసిన జాబితాల మేరకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లిస్తుంది. అయితే ఈ ప్రక్రియ పూర్తి కాకుండానే రైతు భరోసా కేంద్రాల్లో ప్రాథమికంగా ప్రకటించిన జాబితాల ఆధారంగా పచ్చమీడియా తప్పుడు రాతలు రాసి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో మొత్తం 51,491 మంది రైతులకు సంబంధించిన పంటలు నష్టపోయినట్లు అధికారులు ఇప్పటి వరకు గుర్తించారు. వారికి రూ.10.64 కోట్లు పరిహారంగా చెల్లించాలని నిర్ణయించారు. అయితే ఈ సంఖ్యలో మార్పుచేర్పులు ఉండే అవకాశముంది.

అన్నీ అబద్ధాలే..!

సాధారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల్లో వేరుశనగ, టమాట పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. వరి, జొన్న తదితర పంటలు తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లో పండిస్తారు. అయితే పచ్చమీడియా ఈ విషయాన్ని వదిలిపెట్టి తూర్పు మండలాల్లో వేరుశనగ, టమాట, పడమటి మండలాల్లో వరి లాంటి పంటలకు బీమా వర్తించలేదని అబద్ధాలను వల్లిస్తోంది.

నిబంధనల మేరకే..



నిబంధనల ప్రకారమే 2022 ఖరీఫ్ సీజనుకు సంబంధించి పంట బీమా లబ్ధిదారుల జాబితా తయారు చేశాం. పంట నష్టాన్ని బట్టి రూ.260 నుంచి రూ. 24 వేల వరకు పరిహారం పొందిన రైతులు ఉన్నారు. వెదర్ బేసిక్ స్కీమ్, వీల్డ్ బేసిక్ స్కీమ్ రెండు పద్ధతుల్లో బీమా అందిస్తున్నాం. పక్కాగా సర్వే నిర్వహించి వాస్తవిక జాబితాలను సిద్ధం చేశాం.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, తిరుపతి

మైనింగ్ అధికారిపై టీడీపీ నేతల దాడి



మైనింగ్ అధికారిపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి(తిరుపతి రూరల్) : మండలంలోని నాగయ్యగారిపల్లెలో బుధవారం మైనింగ్‌శాఖ అధికారిపై స్థానిక టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామ పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు ఇసుక తరలించేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం ఓ రోడ్డు నిర్మిస్తున్నామని, ఇసుకకు ఐదురోజుల్లో అనుమతుల వస్తాయని, పనులు ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతోనే వచ్చామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే అనుమతులు వచ్చాయే ఇసుక తరలించేందుకు రావాలని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఇంతలో స్థానిక టీడీపీ నేతలు ఓవర్ యాక్షన్ చేశారు. మైనింగ్ అధికారులు, ప్రైవేట్ సంస్థ ప్రతినిధులతోపై దాడి చేశారు. అధికారి చంద్రారెడ్డిపై చేయి చేసుకోవడమే కాకుండా రికార్డులను లాక్కున్నారు. సీఐ రాజశేఖర్ అక్కడకు చేరుకుని టీడీపీ నేతలను అడ్డుకున్నారు. అధికారులు, సంస్థ ప్రతినిధులను పంపేశారు.

13న చంద్రయాన్-3 ప్రయోగం

- పూర్తయిన రాకెట్ అనుసంధానం..
- ఎల్‌వీఎం3-ఎం4 ద్వారా అంతరిక్షంలోకి ఉపగ్రహం





చంద్రయాన్-3 ఉపగ్రహానికి షార్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం , ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు చంద్రయాన్-3 ప్రయోగం నిర్వహించనున్నారు. ఇస్రోకు బాహుబలి రాకెట్‌గా పేరుపొందిన ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా 3,900 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. షార్‌లోని రెండవ వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్-2)తో ఎల్‌వీఎం-3 రాకెట్ అనుసంధానం చేసి ఉంబ్లికల్ టవర్‌కు తరలించే ప్రక్రియను గురువారం ఉదయం చేపట్టనున్నారు. 2019 జులై 22న నిర్వహించిన చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతంగా సాగుతుండగా ఆఖరి రెండు నిమిషాల్లో ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొని సిగ్నల్స్ కట్ కావడంతో విఫలమైన విషయం తెలిసిందే. అలాంటి తప్పిదం పునరావృతం కాకుండా నాలుగేళ్లపాటు అనేక పరీక్షలు నిర్వహించిన అనంతరం చంద్రయాన్-3ని పకడ్బందీగా ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేస్తున్నారు.

మూలాల అధ్యయనం కోసమే..

చంద్రుడిపై మూలాలను అధ్యయనం చేయడం కోసమే చంద్రయాన్ సిరీస్‌లో మూడో ప్రయోగాన్ని చేసేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగం తర్వాత 48 రోజుల పాటు భూమి నుంచి చంద్రుడి వైపునకు చంద్రయాన్-3 ఉపగ్రహం ప్రయాణం చేసి చంద్రుడి కక్ష్య (లూనార్ ఆర్బిట్)లోకి వెళుతుంది. తర్వాత ప్రపొల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి ఉపరితలంలోని దక్షిణ ధ్రువంపై దిగుతుంది. ల్యాండర్‌లో అమర్చిన రోవర్ చంద్రుడి ఉపరితలంపై బయటకు వచ్చి 14 రోజుల పాటు పరిశోధనలు చేస్తుంది. ఈ పర్యాయం చంద్రయాన్-3ని సఫలం చేసేందుకు ఇస్రో తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ ప్రాజక్టుకు సుమారు రూ.615 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిసింది.

అత్యాధునిక పరికరాలతో పరిశోధనలు

చంద్రుడిపై పరిశోధనలను చేసేందుకు ల్యాండర్, రోవర్‌లో అత్యాధునిక పరికరాలు అమర్చారు. చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను కొలవడానికి చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్, చంద్రుడి లాండింగ్ సైట్ చుట్టూ భూకంపతను కొలవడానికి ఇనుస్ట్రుమెంట్ ఫర్ లూనార్ సీస్మిక్ యాక్టివిటీ, రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్‌సెన్సిటివ్ ఆయానోస్పియర్, అట్మాస్ఫియర్ అనే పరికరాలను వినియోగిస్తున్నారు. గ్యాస్, ప్లాస్మా పర్యావరణాన్ని అధ్యయనం చేయడానికి, చంద్రశ్రేణి అధ్యయనాల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా నిష్క్రియ లేజర్ రెట్రో రెఫ్లెక్టర్ శ్రేణి అనే ఒక సైంటిఫిక్ పరికరాన్ని కూడా వాడుతున్నారు. చంద్రుడి ఉపరితల మూలక కూర్పును అధ్యయనం చేయడానికి రెండు సైంటిఫిక్ పరికరాలను రోవర్‌లో అమర్చి పంపుతున్నారు. అల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, లేజర్ ప్రేరేపిత బ్రేక్ డౌన్ స్పెక్ట్రోస్కోప్ అనే రెండు సైంటిఫిక్ పరికరాలతో చంద్రుని మూలాలను అధ్యయనం చేయనున్నారు. చంద్రుని కక్ష్య (లూనార్ ఆర్బిట్) నుంచి భూమిని అధ్యయనం చేయడానికి ప్రపొల్షన్ మాడ్యూల్‌లో ఆర్బిటర్ స్పెక్ట్రోపోలారిమెట్రీ ఆఫ్ హాబిటబుల్ ప్లానెట్ ఎర్త్ అనే సైంటిఫిక్ పరికరం ద్వారా పరిశోధన చేయనున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,360
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,421

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74.00

ఇన్‌చార్జి డీపీటీఓగా జితేంద్రరెడ్డి



జితేంద్రరెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుపతి ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణాధికారిగా (డీపీటీఓ) జితేంద్రరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ డీపీటీఓగా పనిచేస్తున్న టి.చెంగల్‌రెడ్డి ఆగస్టు 31వ తేది వరకు సెలవుపై వెళ్లడంతో చిత్తూరు డీపీటీఓ జితేంద్రరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు : మండలంలోని కొత్తవీరాపురం వడ్డిమిట్టలో బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. ఈ నెల 3న ఇంట్లో నిద్రించిన బాలిక ఉదయం చూసే సరికి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ దొరకలేదు. దీనిపై బాలిక తల్లి వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి, పక్కన ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : పోలీసుల సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ సాధ్యమని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ కోర్టు పరిధిలోని కేసులను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యమైన కేసుల విచారణకు సాంకేతిక ఆధారాలతో హాజరు కావాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. ప్రతి శనివారం డీఎస్పీలు తమ పరధిలోని సీఐలు, ఎస్ఐలతో సమావేశమవ్వాలని స్పష్టం చేశారు. ఆ వారంలో జరిగిన నేరాలపై చర్చించి, నియంత్రణకు చేపట్టాల్సి జాగ్రత్తలకు కార్యాచరణ రూపొందించాలని కోరారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీ లు చేపట్టాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల ను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు పకడ్బందీగా ప్రణాళిక రూపొందించి, క్షేత్రస్థాయిలో నిర్మూలించాలని ఆదేశించా రు. గంజాయి కేసుల్లో ప్రమేయముంటే ఎంతటి వారిని అయినా వదిలేప్రసక్తే ఉండకూడదని స్పష్టం చేశారు. గతంలో సత్ఫలితాలిచ్చిన ఆపరేషన్ పరివర్తన 2.0 స్ఫూర్తిగా మరింత ముందుకు సాగాలని కోరారు. విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో వాటిల్లే నష్టాల ను వివరించాలని తెలిపారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దిశ యాప్‌పై మహిళా పోలీసులు పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, ఎస్ఈబీ జేడీ రాజేంద్ర,లక్ష్మీనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగనన్న వెంటే ముస్లింలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాదర్‌బాషా తదితరులు

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ముస్లింలు ఉంటారని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన ముస్లింలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన సాగిస్తూ, ముస్లింల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగనన్న కృషి చేస్తున్నారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలకు జరిగిన నష్టం, ప్రస్తుతం చేకూరుతున్న మేలుపై రాష్ట్ర వ్యాప్తంగా హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్ అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని చెప్పారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. తండ్రి ఆశయాలను అందిపుచ్చుకున్న జగనన్న నేడు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వెల్లడించారు. నాలుగేళ్లలో డీబీటీ ద్వారా వివిధ పథకాల కింద 34,17,199 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.11,896 కోట్లు జమ చేశారని వివరించారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా కొన్ని వేల కోట్ల నగదును మైనారిటీలకు అందించారని తెలిపారు. గత టీడీపీ హయాంలో ముస్లింల కోసం రూ.2వేల కోట్లు ఖర్చుచేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.22వేల కోట్లు వెచ్చించారని వివరించారు. సంక్షేమ సారథి జగనన్నపై లోకేష్ అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి ప్రజలకు ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ నిలకడ లేకుండా మాట్లాడుతూ రోడ్‌షోలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కలిసి వచ్చినారానున్న ఎన్నికల్లో యావత్ ముస్లింలు జగన్‌వైపు నిలుస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ సిరాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మహ్మద్ రసూల్, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్ ముజీబ్, తాజుద్దీన్‌ఖాన్, ఎస్.అబ్దుల్ గఫూర్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు



ప్రియ, దివ్య (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని కందాడు పంచాయతీ చెన్నప్పగుంట ఎస్టీ కాలనీలో తల్లీబిడకడ అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాలనీకి చెందిన చెంచయ్య భార్య ప్రియ, మూడో కుమార్తె దివ్య(3) ఈ నెల 1వ తేదీ నుంచి కనిపించడంలేదు. దీనిపై భర్త చెంచయ్య ఫిర్యాదు మేరకు అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ



దుండగులు తెరిచిన బీరువా

తడ: మండలంలోని చేనిగుంట గ్రామంలోని ఓ ఇంటిలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. సివిల్ కాంట్రాక్టర్ ఓడూరు సురేష్ బాబు అలియాస్ చిన్నిరెడ్డి సొంత పనుల నిమిత్తం ఈ నెల 3వ తేదీన విజయవాడకు వెళ్లారు. ఆయన భార్యకూడా ఇంటికి తాళం వేసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువా, దేవుని గదిలోని 11 సవర్ల బంగారు నగలు, 700 గ్రాముల వెండి వస్తువులను అపహరించారు. బుధవారం తెల్లవారుజామున పనిమనిషి సుబ్బులమ్మ ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పక్కింటి వారికి విషయం తెలిపింది. వారు అందించిన సమాచారంతో చిన్నిరెడ్డి హుటాహుటిన ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరెడ్డి సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. తిరుపతి నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పంలో బలిజలకు గుర్తింపునిచ్చిన ప్రభుత్వం



బలిజ భవన్‌కు భూమి పూజ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కుప్పం: నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం బలిజ భవన్ నిర్మాణానికి వివాదంలో ఉన్న స్థలం కేటాయించి, రూ.కోటి నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన బలిజ కులస్తులు ఈ సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ బోర్డు సభ్యుడు పోకుల అశోక్ కుమార్, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి భూ వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సంబంధిత పట్టాదారులతో, న్యాయవాదులతో ప్రత్యేకంగా మాట్లాడి పరిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి ఇస్తూ పూర్తి స్థాయి లో స్థలం బలిజ కులస్తులకు కేటాయించారు. మంత్రి ఆదేశాల మేరకు ఎంపీ రెడ్డెప్ప సొంత నిధులతో బలిజ భవన్ ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలు అందించారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. దీంతో బలిజ సామాజిక వర్గం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి చంద్రబాబును నమ్మి మోసపోయామని, ముఖ్యమంత్రితో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటామని స్పష్టం చేసింది.

బాబు హయాంలో...

కుప్పం మండల పరిధిలోని పలార్లపల్లె రెవెన్యూ సర్వే నంబర్ 22లో 2.80 ఎకరాల స్థలాన్ని గతంలో మిలటరీ మాజీ అధికారి ప్రభుత్వం కేటాయించింది. గతంలో దీనిపై రెవెన్యూ అధికార్లు పట్టాలను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా బోర్డులు నాటారు. మిలటరీ మాజీ అధికారి పట్టాను చేతపట్టి పోరాటం సాగించారు. ఇలాంటి వివాదాల భూమిని బలిజ భవన్ నిర్మాణానికి ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీంతో మిలిటరీ మాజీ అధికారి కోర్టును ఆశ్రయించారు. అంతేకాకుండా బలిజ భవన్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ప్రకటనలన్నీ బాబు కాగితాలకే పరిమితం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకతో బలిజభవన్ సమస్యలు పరిష్కారమయ్యాయి.

రెండు బైక్‌ల ఢీ : యువకుడి మృతి

– ఇద్దరికి తీవ్రగాయాలు



లక్ష్మయ్య మృతదేహం గాయపడిన వెంకటేశ్వర్లు, రామ్మోహన్

ఏర్పేడు : మండలంలోని తిరుపతి ఐఐటీ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఇసుకతాగేలికి చెందిన లక్ష్మయ్య(23), వెంకటగిరి మండలం కుర్జాగుంటకు చెందిన వెంకటేశ్వర్లు (36) బావాబావమరుదులు. ఇద్దరూ బైక్‌పై వెంకటగిరికి బయలుదేరారు. అలాగే జంగాలపల్లెలోని మెగా కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ (46) విధులు ముగించుకుని బైక్‌పై ఏర్పేడుకు వస్తున్నాడు. మార్గం మధ్యలో ఐఐటీ వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మరణించాడు. వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లును 108లో శ్రీకాళహస్తి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. రామ్మోహన్‌ను తిరుపతిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 76,254 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,091 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.90 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.